క్లుప్తంగా

నేడు 'అడెల్లి'లో ప్రవచనాలు

సారంగాపూర్: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీఅడెల్లి మహాపోచమ్మ ఆలయం వద్ద ఆదివారం మధ్యాహ్నం పరమపూజ్య శ్రీబాల బ్రహ్మానంద సరస్వతి ప్రవచనాల బోధన ఉంటుందని ఆలయ సీనియర్ అసిస్టెంట్ రమణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక ఏర్పాట్లు చేశామని.. భక్తులు ఆలయానికి తరలివచ్చి కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

వైభవంగా పల్లకిసేవ



పల్లకిసేవ వద్ద భక్తులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని పురాతన శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవరకోట ఆలయంలో శనివారం స్వామివారి పల్లకిసేవ వైభవంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. ఆలయ ప్రాంగణమంతా గోవిందా నామస్మరణంతో మార్మోగింది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఆమెడ శ్రీధర్, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

కార్మికుడికి సాయం



సాయం అందిస్తున్న భగీరథ సిబ్బంది

కుంటాల: మండలంలోని లింబా(కే) గ్రామానికి చెందిన మిషన్ భగీరథ కార్మికుడు జాదవ్ జనార్ధన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. శనివారం తోటి కార్మికులు వారి ఇంటికి వెళ్లి వైద్యఖర్చుల నిమిత్తం తమ వంతుగా రూ.13,400 నగదును సాయంగా అందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కల్యాణ్, యోగేశ్, గంగాప్రసాద్, దేవన్న, కైసర్, రాజు, గజేందర్ పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నాయకులు

నిర్మల్‌రూరల్: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్‌యూటీఎఫ్) ఆధ్వర్యంలో ఇటీవల పదోన్నతి పొందిన ఉపాధ్యాయులను శనివారం ఘనంగా సన్మానించారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎ.వెంకట్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యావ్యవస్థను బాగు చేయాలనే ఆలోచనతో ముందుకెళ్లడం శుభపరిణామం అన్నారు. కొన్ని సంఘాలు పదోన్నతి, బది లీల్లో వెబ్‌ఆప్షన్ పద్ధతిని వ్యతిరేకిస్తే టీఎస్‌యూటీఎఫ్ మాత్రం స్వాగతించిందన్నారు. వెబ్ ఆప్షన్లతో ఇబ్బందిపడిన వారికి ప్రభుత్వం గ్రీవెన్స్ రూపంలో అప్పీల్ చేసుకోమని అవకాశం ఇచ్చిందన్నారు. నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేసేందుకు యూటీఎఫ్ కృషి చేస్తుందని పేర్కొన్నారు. అనంతరం ప్రమోషన్లు పొందిన ముడారపు పరమేశ్వర్, రవికిరణ్, పోశెట్టి, భోజన్నను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసరి శంకర్, పెంట అశోక్, నాయకులు మనోహర్‌రెడ్డి, చల్ల గోవర్ధన్‌రావు, బక్కన్న, అమృతరావు, పోశెట్టి, పైడిపల్లి భోజన్న, బిక్క రమేశ్, గంగాధర్, లింగన్న రాజేశ్వర్, రాజేందర్, వినోద్‌కుమార్, ధన్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

సోన్: సోన్ ఎంపీపీగా బర్ల మానస హరీశ్‌రెడ్డి ప్రజలకు చేసిన సేవలు అభినందనీయమని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ శోభారాణి-సత్యనారాయణ పేర్కొన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని ఇందిరానగర్‌లో ఉన్న తన నివాసంలో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దంపతులు.. సోన్ తాజా మాజీ ఎంపీపీ మానస-హరీశ్‌రెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు సాగర్, తాజా మాజీ వైస్ ఎంపీపీ అంకుల్ నాగయ్య, మాజీ ఎంపీపీ సరికెల గంగన్న, మాజీ ఎంపీటీసీ జక్క రాజేశ్వర్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అశోక్, బీజేపీ నాయకులు నరేశ్, నర్సయ్య, రమేశ్‌రెడ్డి, గంగాధర్, అమృత్, మక్కన్న పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం

భైంసాటౌన్: లయన్స్ క్లబ్ ఆఫ్ భైంసా డైమండ్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డాక్టర్ ముత్యంరెడ్డి, కార్యదర్శిగా బి. శివకుమార్, కోశాధికారిగా శంకర్‌ను ఎన్నుకున్నారు. బీఆర్‌ఎస్ నాయకులు విలాస్ గాదేవార్, ఏరియాస్పత్రి సూపరింటెండ్ కాశీనాథ్ తదితరులు నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు.

పట్టణంలో పార్కింగ్ తిప్పలు..!

- ప్రైవేట్ ఆస్పత్రులు, దుకాణ సముదాయాలకు స్థలాలు కరువు
- రోడ్లపైనే వాహనాల నిలిపివేత
- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న ప్రజలు



కుభీర్‌రోడ్డులో ఓ ప్రైవేట్ ఆస్పత్రి వద్ద ఇరుకుగా రోడ్డు

పై చిత్రం పట్టణంలోని కుభీర్ చౌరస్తా ప్రాంతంలోనిది. ఈ మార్గంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రితోపాటు ఓ బ్యాంకు ఉంది. ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి బంధువులు, బ్యాంకులో లావాదేవీల కోసం వచ్చే ఖాతాదారులు తమ వాహనాలను రోడ్డుపైనే నిలుపుతున్నారు. పార్కింగ్ స్థలం లేకపోవడం, రోడ్డు ఇరుకుగా ఉండడంతో ఈ మార్గంలో ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతోంది. కుభీర్‌కు వెళ్లే ఆర్టీసీ బస్సులు, పెద్ద వాహనాలు వెళ్లిన సందర్భాల్లో ట్రాఫిక్ జాం అవుతోంది.



టీఎన్జీవోస్ కాంప్లెక్స్ ముందు రోడ్డుపైనే నిలిపిన వాహనాలు

పై చిత్రం పట్టణంలోని బస్టాండ్‌కు వెళ్లే ప్రధాన రోడ్డు. ఈ మార్గంలోని టీఎన్జీవోస్ కాంప్లెక్స్ దుకాణ సముదాయానికి పార్కింగ్ స్థలం లేకపోవడంతో అక్కడికి వచ్చేవారు తమ వాహనాలను రోడ్డుపైనే పార్క్ చేస్తున్నారు. ప్రధాన రోడ్డు కావడంతో రద్దీ సమయాల్లో ఇతర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

భైంసాటౌన్: డివిజన్ కేంద్రమైన భైంసా పట్టణంలో పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. దుకాణ సముదాయాలు, ప్రైవేట్ ఆస్పత్రులకు సరైన పార్కింగ్ స్థలాలు లేవు. దీంతో వివిధ అవసరాల నిమిత్తం ఆయా చోట్లకు వచ్చేవారు తమ వాహనాలను రోడ్డుపైనే నిలుపుతున్నారు. అసలే ఇరుకురోడ్డు, ఆపై వాహనాల పార్కింగ్‌తో ఇతర వాహనదారులు, ప్రజలు రాకపోకలకు కష్టాలు పడుతున్నారు. ముఖ్యంగా జనాలు ఎక్కువగా వెళ్లే ఆస్పత్రులు, బ్యాంక్‌లు, దుకాణాల వద్ద వాహనాల పార్కింగ్ కోసం స్థలం ఉండాలి. కానీ పట్టణంలో చాలా వాటికి సరైన పార్కింగ్ స్థలాలు లేవు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే భైంసా మార్కెట్ రెండో స్థానంలో ఉంది. మరోవైపు డివిజన్ కేంద్రం కావడం, ప్రభుత్వ కార్యాలయాలు ఉండటంతోపాటు వివిధ పనుల నిమిత్తం భైంసాకు వచ్చి పోయేవారు ఎక్కువ. వాహనాల రద్దీకి అనుగుణంగా భైంసాలో పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో ఎక్కువ మంది తమ వాహనాలను రోడ్డుపైనే నిలుపుతున్నారు.

పట్టణంలోని పలు ప్రాంతాల్లో...

పాతపట్టణం నుంచి బస్టాండ్ వెళ్లే ప్రధాన మార్గంతోపాటు బస్టాండ్ పరిసరాల్లో దుకాణాలు, ప్రైవేట్ ఆస్పత్రులు ఉన్నాయి. ప్రధాన రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్, పాదబాట ఉన్నా.. వాటిని ఆనుకునే నిర్మాణాలు ఉండడంతో వాహనాల పార్కింగ్‌కు ఇబ్బంది ఏర్పడుతోంది. సెట్‌బ్యాక్ లేకపోవడంతో పాదబాటపైనే వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు.



నర్సింహానగర్ వెళ్లే మార్గంలో వాహనాల పార్కింగ్

దీనికితోడు చిరువ్యాపారులు సైతం పాదబాటపైనే దుకాణాలు, తోపుడుబండ్లు ఏర్పాటు చేస్తుండడంతో రోడ్డు మరింత ఇరుకుగా మారుతోంది.

- నర్సింహానగర్‌కు వెళ్లే రోడ్డులో ఉన్న ప్రైవేట్ ఆస్పత్రులకు వచ్చేవారు తమ వాహనాలను రోడ్డుపైనే నిలుపుతున్నారు. దీంతో రోడ్డు ఇరుకుగా మారి ఇబ్బంది ఏర్పడుతోంది. ఇదే మార్గంలో ప్రైవేట్ పాఠశాల ఉండటంతో స్కూల్ బస్సు వంటి పెద్ద వాహనాలు వెళ్లినప్పుడు ట్రాఫిక్‌జాం ఏర్పడుతోది.
- ఐబీ చౌరస్తా వద్ద సైతం పులేనగర్, వినాయక్‌నగర్ వెళ్లే కూడలి వద్ద సాయంత్రం వాహనాల రద్దీ నెలకొంటుంది. ఇదే మార్గంలో ప్రైవేట్ ఆస్పత్రులు ఉండగా.. వాహనాల పార్కింగ్‌తో రోడ్డు ఇరుకుగా మారి ఇబ్బంది ఏర్పడుతోంది.
- పాతసినిమా టాకీస్ రోడ్డులోనూ దుకాణాల ఎదుట వాహనాల పార్కింగ్‌తో ఇరుకుగా మారి పలుమార్లు రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతోంది.
- నిర్మల్ చౌరస్తా ప్రాంతంలో జాతీయ రహదారిపై తరచూ వాహన ప్రమాదాలు జరుగుతున్నాయి. హైవే కావడంతో భారీ వాహనాలు వేగంగా వస్తుంటాయి. ఈ కూడలి వద్ద సిగ్నలింగ్ వ్యవస్థ లేకపోవడంతో వేగంపై నియంత్రణ లేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మున్సిపల్, పోలీసు అధికారులు సమన్వయంతో రోడ్లపై వాహనాల పార్కింగ్ నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇష్టారీతిన వాహనాలు నిలిపితే చర్యలు

పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం. వివిధ అవసరాల నిమిత్తం బయటకు వచ్చేవారు రోడ్లపై ఇష్టారీతిన వాహనాలు నిలిపితే వాటిని సీజ్ చేస్తాం. ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా పార్క్ చేయాలి. లేకుంటే చర్యలు తీసుకుంటాం.

– డి.రాజారెడ్డి, సీఐ, భైంసా పట్టణం

విద్యావలంటీర్లను నియమించాలి

భైంసాటౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు పూర్తవడంతో ఏర్పడిన ఖాళీల్లో ప్రభుత్వం వెంటనే విద్యావలంటీర్లను నియమించాలని ఎస్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్. భూమన్నయాదవ్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఖాళీలు భర్తీ చేయకుండా పని సర్దుబాటు పేరిట అధికారులు ఉత్తర్వులు జారీ చేయడం సరికాదన్నారు. కొన్నిచోట్ల ఉపాధ్యాయులు లేక ప్రాథమిక స్థాయిలో పాఠశాలలు మూతపడుతున్నాయని.. దీంతో ఎస్జీటీలపై పని భారం పడుతోందని అన్నారు. డీఎస్సీ ద్వారా ఖాళీలు భర్తీ చేసే వరకు విద్యార్థుల నిష్పత్తికనుగుణంగా విద్యావలంటీర్లను నియమించాలని కోరారు.

జామ్ గురుకులంలో పోషకుల కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న అధ్యక్షుడు ప్రభాకర్

సారంగాపూర్: మండలంలోని జామ్ గ్రామంలోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో పోషకుల కమిటీని శనివారం ప్రిన్సిపాల్ రమాకల్యాణి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా ప్రభాకర్, ఉపాధ్యక్షురాలిగా రాధ, కార్యదర్శిగా జలాయం సింగ్, కోశాధికారిగా పోశెట్టి, సభ్యులుగా సుమన్, రాజేశ్వర్, ప్రభాకర్, దేవేందర్, అశోక్, భోజన్న, రాములు ఎన్నికయ్యారు. ఈసందర్భంగా నూతన అధ్యక్షుడు ప్రభాకర్ మాట్లాడుతూ పాఠశాల సమస్యల పరిష్కారంలో కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు ఉన్నారు.

మైనర్లకు వాహనాలిస్తే కేసు నమోదు

- సోన్ సీఐ నవీన్‌కుమార్
- పలుచోట్ల ముమ్మర తనిఖీలు నిర్వహించిన పోలీసులు



సోన్: గంజాల్ టోల్‌ప్లాజా వద్ద తనిఖీ చేస్తున్న సీఐ నవీన్‌కుమార్, సిబ్బంది

సోన్: మైనర్లకు వాహనాలిస్తే ఓనర్లపై కేసులు నమోదు చేస్తామని సోన్ సీఐ నవీన్‌కుమార్ అన్నారు. ఎస్పీ జానకీ షర్మిల ఆదేశాల మేరకు మండలంలోని గంజాల్ టోల్‌ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ధ్రువపత్రాలు పరిశీలించి వాహనాలకు ఉన్న బ్లాక్‌స్టిక్కర్లను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడుపవద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భైంసాటౌన్: నంబర్‌ప్లేట్ లేని వాహనాలు నడిపితే చీటింగ్ కేసు నమోదు చేస్తామని సీఐ డి.రాజారెడ్డి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం పట్టణంలోని నిర్మల్ చౌరస్తా ప్రాంతంలో సీఐ ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మికంగా వాహనాల తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్సై షరీఫ్, సిబ్బంది ఉన్నారు.

చించోలి(బి) ఎక్స్‌రోడ్డు వద్ద..

సారంగాపూర్: ఎస్పీ జానకీ షర్మిల ఆదేశాల మేరకు శనివారం మండలంలోని చించోలి(బి) ఎక్స్‌రోడ్డు వద్ద నిర్మల్-ఆదిలాబాద్, నిర్మల్-చించోలి(బి) ఎక్స్‌రోడ్డు వద్ద నాకాబందీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా రహదారుల్లో వచ్చే వాహనాలను తనిఖీ చేశారు. నంబర్ ప్లేట్‌తోపాటు ధ్రువపత్రాలు సరిగా లేని 14 ద్విచక్ర వాహనాలతోపాటు కారుకు ఉన్న బ్లాక్‌ఫిల్మ్ తొలగించి జరిమానా విధించారు.



కారు అద్దాలకు ఏర్పాటు చేసిన బ్లాక్ ఫిల్మ్ తొలగిస్తున్న సారంగపూర్ ఎస్సై శ్రీకాంత్

దస్తురాబాద్: మండల కేంద్రంలోని కలమడుగు -పాండ్వాపూర్ ప్రధాన రహదారిపై శనివారం పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నాకాబందీ నిర్వహించారు. ధ్రువపత్రాలు సరిగా లేని వాహనాల వివరాలను నమోదు చేసుకున్నారు. తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ దైవాకార్, రాజలింగన్న, సిబ్బంది షఫీ, రవి, ఉషన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



భైంసాలో వాహనదారుడితో మాట్లాడుతున్న సీఐ రాజారెడ్డి

పెంబి: మండల కేంద్రంలో ఎస్సై శంకర్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం పోలీసులు నాకాబందీ నిర్వహించారు. ఈసందర్భంగా ధ్రువపత్రాలు సరిగా లేని 10 ద్విచక్రవాహనాలు, ఆటోను సీజ్ చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. మైనర్లకు వాహనాలిచ్చినా, నంబర్‌ప్లేట్ లేకున్నా.. ఓనర్లపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. నేరాలు జరిగితే 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

మహాలక్ష్మీ ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న మహిళలు



కుంకుమార్చనలో మహిళలు

కుంటాల: మండల కేంద్రంలోని శ్రీమహాలక్ష్మి ఆలయ అమ్మవారి 17వ వార్షికోత్సవం శని వారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విఘ్నేశ్వర పూజ, నవ కలశ స్థాపన, పుణ్యాహవచనం, అభిషేకం, అలంకరణ, లక్ష్మి అష్టోత్తర శతనామ స్తోత్ర సహిత కుంకుమార్చన, మంత్రపుష్పం, మహాహారతి, నైవేద్యం ప్రసాద వి తరణ కార్యక్రమాలు నిర్వహించారు. జనగామ ఆర్టీవో, ఆలయ నిర్మాణ దాత జీవి.శ్రీనివాస్ గౌడ్, మాజీ జెడ్పీటీసీ ప్రకాశ్‌గౌడ్, రమేశ్‌గౌడ్, నర్సాగౌడ్, రామానుజదాస్ పాల్గొన్నారు.

నిల్వనీటిని పారబోయాలి

దిలావర్‌పూర్: సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పరిసరాల్లో నిల్వనీటిని పారబోయాలని దిలావర్‌పూర్ మండల వైద్యాధికారి శ్యాంకుమార్ అన్నారు. శనివారం దిలావర్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యారోగ్య సిబ్బంది, అంగన్‌వాడీలు, ఆశవర్కర్లతో కలిసి మండల కేంద్రంలోని పలు వార్డుల్లో పర్యటించారు. ఈసందర్భంగా ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యాధులకు కారకాలైన దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ఇంటి పరిసరాల్లో జాగ్రత్తలు పాటించాలన్నారు. పలువురి ఇళ్లలో డబ్బాలు, పాతటైర్లలో నిల్వనీటిని, వస్తువులను సిబ్బంది తొలగించారు. జ్వరం లక్షణాలుంటే ఆరోగ్య కేంద్రానికి రావాలని సూచించారు. కార్యక్రమంలో ఆశవర్కర్లు జె.శోభ, లక్ష్మి, విజయ, అంగన్‌వాడీ టీచర్లు సునంద, కె.శ్యామల, శీనుబాయి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన పెంచుకోవాలి

ముధోల్ : సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అవగాహన పెంచుకొని అప్రమత్తంగా ఉండాలని భైంసా ప్రభుత్వ ఆసుపత్రి, పిల్లల వైద్య నిపుణులు బందెల నరేశ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రబీంద్ర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులు, దోమలు కుట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పరిసరాల్లో బ్లీచింగ్‌పౌడర్ చల్లడంతోపాటు భోజనానికి ముందు, తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సాయినాథ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



దిలావర్‌పూర్‌లో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

'మతిన్ మాఫియాపై చర్యలు తీసుకోవాలి'

నిర్మల్‌చైన్‌గేట్: మతిన్ మాఫియా పేరిట నిర్మల్‌లో ఆగడాలు సృష్టిస్తున్న వారిపై పూర్తి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సింగారు వెంకటేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోషల్ మీడియా ప్రభావంతో యువత పెడదారి పడుతున్నారన్నారు. మద్యానికి, డ్రగ్స్‌కు అలవాటై జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. సోషల్‌మీడియాలో చెడు రీల్స్ చూస్తూ ఈజీ మనీ కోసం పక్కదారి పడుతున్నారని అన్నారు. కళాశాలలో సోషల్ మీడియాతో కలిగే నష్టాలను బోధించాలని కోరారు. కార్యక్రమంలో రాజ్, మారుతి, రాజేశ్, నవీన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్

మొక్కలు నాటిన విద్యార్థులు



విద్యార్థులతో మొక్కలు నాటుతున్న సిబ్బంది

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్ మహాత్మా జ్యోతిబాపూలే గురుకులం, కళాశాలలో శనివారం వన మహోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి ప్రిన్సిపాల్ కె.రాజు మొక్కలు నాటారు. కార్యక్రమంలో అధ్యాపకులు సాగర్, మల్లికార్జున్, పుణ్యవతి, లావణ్య, గౌతమి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్: పర్యావరణాన్ని కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం వన మహోత్సవంలో భాగంగా జిల్లా కేంద్రంలోని విజేత పాఠశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది సంతోష్, ప్రిన్సిపాల్ సుమలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. మరమ్మతులు చేయించరూ..



కుభీర్: మండలంలోని సాయినగర్ కల్వర్టు వద్ద రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. మూడేళ్లుగా ఏటా వర్షాకాలంలో రోడ్డు కొంత కోతకు గురవుతున్నా.. ఆర్‌అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేయించడం లేదు. రాత్రివేళ రాకపోకలు సాగించే వాహనదారులు ఈ గుంతలో పడి గాయపడుతున్నారు. భారీవర్షాలు కురవక ముందే అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రశ్నించాల్సిన అధికారి: రఘు, ఆర్‌అండ్‌బీ ఏఈ, ఫోన్: 99123 87696

ప్రమాదకరంగా మలుపులు



మన్మద్ నుంచి రాజూరకు వెళ్లే మార్గంలో మలుపు



లోకేశ్వరం నుంచి హవర్గకు వెళ్లే మార్గంలో..

లోకేశ్వరం: మండలంలోని రాయపూర్‌కాండ్లీ, ధర్మోరా, హవర్గ, రాజూరా, కిష్టాపూర్, మన్మద్ తదితర గ్రామాల సమీపాల్లో రోడ్లపై ఉన్న మూలమలుపులు ప్రమాదకరంగా మారాయి. దీంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయించాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పొదలు తొలగించాలి



మండలంలోని హవర్గ, రాజూరా గ్రామాలకు వెళ్లే మార్గంలో మలుపుల వద్ద పొదలు ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించడం లేదు. వెంటనే పొదలు తొలగించాలి.


– సాయన్న, పంచగుడి

సూచికబోర్డులు ఏర్పాటు చేస్తాం

మండలంలోని అన్ని గ్రామాల్లో పీఆర్ రోడ్లకు ఇరువైపులా ఉన్న పొదలను తొలగిస్తాం. మూల మలుపుల వద్ద సూచిక బోర్డులను ఏర్పాటు చేస్తాం.

– రఘువంశీ, పీఆర్ ఏఈ, లోకేశ్వరం

అవార్డు గ్రహీతకు సన్మానం



ముత్తన్నను సన్మానిస్తున్న మిత్రులు

లక్ష్మణచాంద: ఇటీవల ఢిల్లీలో 'ఇంటర్నేషనల్ ఆర్ట్స్ ఎక్స్‌లెన్స్ అవార్డు' తోపాటు 'జ్యోతిష భీష్మ బిరుదు పొందిన డా.బిట్లింగ్ ముత్తన్నను శనివారం మండలంలోని వడ్యాల్ ఎల్లమ్మ ఆలయంలో సన్మానించారు. వడ్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆయనతో కలిసి 1994–95లో పదో తరగతి చదివిన మిత్రులు ఘనంగా సన్మానించారు. వడ్యాల్‌కే చెందిన మరో మిత్రుడు శంకర్ స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందగా ఆయనను కూడా సన్మానించారు. కార్యక్రమంలో సురేశ్‌గౌడ్, ఎస్.రాము, వేణుగౌడ్, రమేశ్, శ్రీనివాస్, నర్స య్య, మధుసూదన్, రాజాగౌడ్, జీవన్, నరేశ్, రాజేశ్వర్ పాల్గొన్నారు.